అంగన్‌వాడీల దీక్షకు ప్రజా సంఘాల మద్దతు

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలో శనివారం 5వ రోజు అంగన్‌వాడీల ఆందోళన దీక్షకు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ టి.రాజారావు, మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జీఎస్ రాయల్, పొన్నూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు తోట రాంబాబు, పూల సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్స్‌ను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నల్లరిబ్బన్లతో అంగన్‌వాడీల నిరసన

విశాలాంధ్ర-తాడికొండ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తాడికొండ పోలీస్ స్టేషన్ సమీ పంలో కళ్ళకు నల్ల రిబ్బన్లు ధరించి శనివారం నిరసన తెలిపారు. ఆందోళనలు చేస్తే మినహా ప్రభుత్వం స్పందించే పరిస్థితి లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా తమ కేంద్రాలపై దాడులు చేయ టం ఏమిటని నిలదీశారు. ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోవాలని హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె.జగన్ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లి : కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్డ్ బెనిఫిట్స్, పెన్షన్ తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె శనివారం ఐదో రోజుకు చేరుకుంది. తాడేపల్లి మండలంలో నూరు శాతం సమ్మె చేసి తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య మద్దతు తెలిపారు. ఈ సమ్మెకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) మంగళగిరి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు సరళ, తబితా, కిరణ్మయ్, మాణిక్యం, శ్రీదేవి, భవాని, సుజాత, లక్ష్మి, శోభా, వరలక్ష్మి, ఫాతిమా, మాధూరి తదితరులు నాయకత్వం వహించారు.

ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏడుకొండలు

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంగళగిరి పట్టణానికి చెందిన టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు పేరం ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఎరుకుల సేవా సంఘంకు మొట్టమొదటిసారిగా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేరం ఏడుకొండలు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ నిర్వహించిన రాష్ట్ర కమిటీ చైర్మన్ పాలపర్తి శ్రీనివాస చక్రవర్తికి ఎన్నికలు అధికారి పీవీ గాయత్రీ దేవికి, కోర్ కమిటీ సభ్యులందరికి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో ఎరుకల జాతి సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక గ్రాండ్ నాగార్జున హెూటల్ నందు హైదరాబాది పాట్ బిర్యానీ స్టైల్‌తో తీర్చిదిద్దిన కుండ బిర్యాని, తాయ్ ఫుడ్ ఫెస్టివల్‌ను శనివారం జనసేన పి.ఎ.సి సభ్యులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు నగర ప్రజలకు వినూత్నమైన రీతిలో హైదరాబాది స్టైల్లో బిర్యాని ఫెస్టివల్‌ను ఏర్పాటు చేయటం సంతోషదాయకమని అన్నారు. వివిధ రకాల నాన్ వెజ్ వెరైటీతో కుండ ధమ్ బిర్యాని ఫెస్టివల్‌ను అందు బాటులోకి తెచ్చిన హెూటల్ గ్రాండ్ నాగార్జున వారికి ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. హెూటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాచమల్లు అరవింద్ మాట్లాడుతూ ఈ నెల 16నుండి జనవరి 16వ తేది వరకు పాట్ బిర్యాని ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూటల్ చైర్మన్ తమ్మినేని సాంబిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలకు యడ్లపాటి జీవితం ఆదర్శం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: భావితరాలకు యడ్లపాటి జీవితం ఆదర్శం కావాలి.. అయన వ్యక్తిత్వం, విజయాల స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ప్రేరణ కావాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజమాష్టారు అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పప్పుల దేవదాస్ ఆధ్వర్యంలో మాజీ జిల్లా టిడిపి అధ్యక్షులు కి.శే. యడ్లపాటి వెంకట్రావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. దాసరి రాజమాష్టారు తదితరులు హాజరై యడ్లపాటి వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, మేళం సైదయ్య, గుడిమెట్ల దయారత్నం, కూనంనేని వెంకటరమణ, పాటిబండ్ల బలరాం, యర్రగుంట్ల ఆనంద్, మన్యం మాల్యాద్రి, మహేష్ పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ

విశాలాంధ్ర, తెనాలి : యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటి వ్యవస్థాపకుడు, ఛైర్మన్ షేక్ సాధిక్ సోషల్ సర్వీస్ యాక్టివిటీస్‌లో భాగంగా రూ.40వేలు వ్యయంతో ట్రై సైకిల్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని వివిధ వార్డులకు చెందిన వికలాంగులకు ట్రైసైకిల్స్ అందించారు. యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటి చేస్తున్న సేవాకార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఎన్నో సేవాకార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వికలాంగులు, వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సొసైటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు కోసం నాగేంద్రబాబు దరఖాస్తు

విశాలాంధ్ర-తాడేపల్లి : జనసేన నేత నాగేంద్ర బాబు ఏపీలో కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వడ్డేశ్వరంలో కొత్త ఓటు కోసం ఫారం-6తో దరఖాస్తు చేసుకున్నారు. నాగబాబుకు హైదరాబాద్‌లో ఓటుహక్కు ఉంది. దాన్ని రద్దు చేసుకుని ఏపీలో ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయన ఇచ్చిన డోర్ నెంబర్‌లో విచారణ చేయగా తాళం వేసి ఉంది. దాంతో బూత్ లెవల్ ఆఫీసర్ పక్కన ఇంటి వారికి సమాచారం అందించారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న నాగబాబును తమ వద్ద హాజరుకావాలని బీఎల్వో నోటీసు ఇచ్చారు.

కేసీఆర్‌కు పట్టిన గతే జగన్‌కు పడుతుంది

ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకుల హెచ్చరిక

విశాలాంధ్ర-గుంటూరు : నిరుద్యోగ యువతను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి తెలంగాణలో కేసీఆర్‌కు పట్టినగతే పడుతుందని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు షేక్ వలి, బందెల నాసర్ జీలు హెచ్చరించారు. ఏపీపీఎస్సీ ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అభ్యర్థుల వయోపరిమితి 42 నుంచి 45 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని భగత్ సింగ్ సర్కిల్ వద్ద విద్యార్థులు, యువకులు శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-2 ఉద్యోగాలకు ఈ ప్రభుత్వంలో ఇదే మొదటి నోటిఫికేషన్ కావడంతో నిరుద్యోగుల ఇబ్బందులు గమనించి వయోపరితిని 45 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో గరిష్ట పరిమితి 44 సంవత్సరాలుగా ఉందని, ఏపీలో నాలుగేళ్ల నుంచి నోటిఫికేషన్స్ కోసం అభ్యర్థులు నిరీక్షించారని, ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు పోస్టుల భర్తీకి 5 సంవత్సరాలుగా నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల ముందు హడావిడిగా విడుదల చేసి నిరుద్యోగ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. పైగా యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టులకు నోటికేషన్ ఇచ్చిన రోస్టర్ పాటించకుండా రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ మార్చి 17న, గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫిబ్రవరి 25న జరుగుతాయని ఏపీపీఎస్సీ ప్రకటించిందని, ఆ తరువాత మెయిన్స్‌కు 3 నుంచి 6 నెలల సమయం ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో ప్రిలిమ్స్ మాత్రమే జరుగుతాయన్నారు. ప్రిలిమ్స్ ఫలితాలు ఎన్నికలు తరువాతే వచ్చే అవకాశం ఉందని, నోటిఫికేషన్ విడుదల చేసి కనీసం విద్యార్థులకు సరైన సమయం ఇవ్వకుండా తొందరగా పరీక్షలు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. రేపు ప్రభుత్వం మారితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రిలిమ్స్ పరీక్షా తేదీని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ నిజంగా ఉద్యోగాలు భర్తీ చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు నాలుగున్నర సంవత్సరాలు సమయం ఎందు కు పట్టిందని ప్రశ్నించారు. కేవలం ఎన్నికలకు రెండు మూడు నెలలు దగ్గరకు వస్తున్న సందర్భంలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు దగ్గర కావా లని జగన్‌మోహన్ రెడ్డి చూస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అభ్యర్థులను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు చల్లా మరియదాసు, ఏఐవైఎఫ్ నాయకులు మస్తాన్‌రావు, జాని, అల్లాభక్షు, ఖాసీం, సుభాని, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి బి.శశి, ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు సాయి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 15వ వార్డులోని రెడ్ల బజార్, 14వ వార్డు లాంచెస్టర్‌లో ఎమ్మెల్యే ముస్తఫా విస్తృతంగా పర్యటించి సైడ్ కాలవలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మరమ్మత్తుల పనులు గురించి చర్చించారు. అదేవిధంగా స్థానికులు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సహాయం కావాలన్న 24గంటలు అందుబాటులో ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో తన కుమార్తె నూరి ఫాతిమాను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల జ్యోతి, శ్రీనివాస్, రామనబోయిన అజయ్ యాదవ్, వైసీపీ నాయకులు వాకా శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, హనుమయ్య, అంజిరెడ్డి, మురళి పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తి మినహాయింపు అప్రజాస్వామికం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం బిల్లు-2023ను ఈ నెల 12వ తేదీ రాజ్యసభలో ఆమోదించటానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించటం అప్రజాస్వామికమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి ఉండేవారని, కానీ నేడు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో అధికార పార్టీకి చెందిన మంత్రి ఉండే విధంగా మార్పులు చేయటం ద్వారా ఎన్నికల కమిషన్ తన తటస్థ స్వభావాన్ని కోల్పోతుందన్నారు. ఎంపిక విధానంలో ఇప్పటి వరకు ఉన్న చిన్న చెక్ అండ్ బ్యాలెన్స్ కూడా ఇప్పుడు రద్దవుతుందని, ఇది ప్రజాస్వామ్య మూలాధార సూత్రాలను ఉల్లంఘించడమే గాక దేశంలో ఫాసిస్ట్ నిరంకుశ పాలనను బలోపేతం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వపు దుర్మార్గపు చర్యకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య భావాలు ఉన్న ప్రజలందరూ ఉద్యమించాలని, ఈ ఫాసిస్ట్ బిల్లును రద్దు చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి దేశవ్యాప్తంగా శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని లక్ష్మణరెడ్డి అన్నారు.

5వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

విశాలాంధ్ర, తెనాలి : శనివారం తెనాలిలో 5వ రోజు అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. అంగన్‌వాడి కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించి సమ్మె స్థలానికి చేరుకున్నారు. ఆర్.టి.సి. రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యకర్తలు, టిడిపి మహిళానేతలు సమ్మెలోపాల్గొని మద్దతు తెలియజేశారు. అంగన్‌వాడీల న్యాయపోరాటానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా కళ్ళకు గంతలు కట్టుకుని దీక్షాశిబిరంలో కూర్చున్నారు. ముఖ్యమంత్రి తాను యిచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అణచివేత చర్యలకు పూనుకోవడం సరికాదన్నారు. గతంలో నిర్బంధాన్ని ప్రయోగించిన టిడిపి ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిందని గుర్తుచేశారు. ధర్నాలో కె.శంకరరావు, రేణుక, రమాదేవి, కుమారి, జ్యోతి, పావని, అనూరాధ, అంజనకుమారి, హైమావతి, రంగపుష్ప, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

20న నగరపాలక సంస్థలో సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్(ఏపీ జేఏసీ అమరావతి అనుబంధం) విన్నపాన్ని మన్నించి గత సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అధికారికంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుటకు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అంగీకరించి అధికారులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదిన జరిగే ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, మలేరియా, టౌన్ ప్లానింగ్ కార్మికులందరూ, ఉద్యోగులందరూ పాల్గొని ఏసుక్రీస్తు ప్రభువు ఆశీర్వాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మేడిపల్లికి తుమ్మల సాహిత్య పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు : అరసం నిర్మాత, అభ్యుదయ సాహితోద్యమ నేత తుమ్మల వెంకట రమేష్ సాహిత్య పురస్కారాన్ని 2023 సంవత్సరానికి ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య మేడిపల్లి రవికుమార్‌కు అందిస్తున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేది సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగే ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారని, విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ్ రెడ్డి రూ.5116 నగదు, జ్ఞాపిక, శాలువాతో రవికుమార్‌ను సత్కరిస్తారని తెలిపారు. ఈ సభలో మేడిపల్లి 'అభ్యుదయ సాహితోద్యమ ఆవశ్యకత' అంశంపై తుమ్మల స్మారక ప్రసంగం చేస్తారని వెల్లడించారు.

మేడిపల్లి జీవిత విశేషాలు: ప్రకాశం జిల్లా అద్దంకిలో జన్మించిన మేడిపల్లి రవికుమార్ పెరిగింది కృష్ణా జిల్లాలో. విద్యాభ్యాసం కృష్ణా జిల్లాలోని మర్లపాలెం, విస్సన్నపేట, తిరువూరు, నూజివీడు, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఎంఫిల్, పీహెచ్‌డీ మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో అధ్యాపకుడిగా పదవీ విరమణ గావించారు. 2022 ఆగస్టు నుంచి ఇప్పటికి 20 మందికి పీహెచ్‌డీలు, 10 మందికి ఎంఫిల్ పరిశోధకులకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. సాహిత్య చరిత్ర రచనలో ఆరుద్రకు 15 సంవత్సరాలు సహాయకునిగా పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు చదువుతున్న ఇంటర్ మీడియట్ పాఠ్య పుస్తకాలు, స్పెషల్ తెలుగుతో సహా నాల్గింటికి ప్రధాన సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం ఆరుద్ర మోనోగ్రాఫ్‌ను రచిస్తున్నారు.

'ప్రజ్ఞ' పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక నగరంపాలెం 'ప్రజ్ఞ' విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక గుండారావుపేట క్రైస్తవ దేవాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో వేడుకగా జరి పారు. బాలబాలికలు క్రైస్తవ భక్తి గీతాలకు అనుగుణంగా ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ తాతలు ఆడి, పాడి సందడి చేస్తూ చిన్నారులకు కేకులు, బిస్కెట్లు అందజేశారు. విద్యార్థులచే ప్రదర్శించిన దేవదూతల నడుమ బాల క్రీస్తు జననం నృత్య నాటిక భక్తి పారవశ్యంలో ఓలలాడించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలకు పైగా నాణ్యమైన విద్య బోధనతో పాటు కులమ తాలకతీతంగా పండుగల పరమార్థాన్ని తెలియజేసేలా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. చర్చి వ్యవస్థాపకులు పాస్టర్ డి జాన్ మోహన్ ప్రార్థనలు నిర్వహిం చగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, బాలబాలికలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల దీక్షలకు ఏపీటీఎఫ్ మద్దతు

విశాలాంధ్ర-పొన్నూరు: గత ఐదు రోజులుగా పలు డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు పొన్నూరు నందు చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షలకు శనివారం ఏపీటీఎఫ్ పొన్నూరు జోన్ నాయకులు సంఘీభావం వ్యక్తం చేశారు. అంగన్వాడి టీచర్లు వర్కర్లు చేపడుతున్న సమ్మెకు తమ మద్దతు తెలుపుతున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ భాషా తెలిపారు. అంగన్వాడీ టీచర్లు వర్కర్ల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన కోరారు. అంగన్వాడీ టీచర్లకు రూ.26వేలు కనీస వేతనం చెల్లించాలని, పెండింగ్లో ఉన్న అంగన్వాడి కేంద్రాల భవన అద్దెలు, 2017 నుండి చెల్లించాల్సిన టిఏ బిల్లులు, ఇతర బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ షేక్ బద్రుద్దీన్, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎం ఎం ఖుద్దుస్, ప్రధాన కార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు, రాజా, శ్రీనివాసరావు, మురళి, వెంకటరత్నం, జోగేశ్వరరావు, హబీబ్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఐఎస్ డేటాపై ట్రైనింగ్ క్లాసులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డేటాను ఎప్పటికప్పుడు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో అప్ టు డేట్‌గా అప్లోడ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్‌ఓ)డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సూపర్ వైజర్లకు, డీఈఓలకు ఆదేశించారు. ఈ మేరకు శనివారం డిఎంహెచ్‌ఓ కార్యాలయంలోని సమావేశ మందిరం నందు సూపర్‌వైజర్లకు, డీఈఓలకు హెచ్‌ఎంఐఎస్ డేటాపై ట్రైనింగ్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలు పెంచే కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండల స్థాయి ఉద్యోగులు మండల ఆఫీసు కేంద్రం నందు, అలాగే జిల్లా స్థాయి ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాలు నందు హాజరుకావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబందించిన బ్రోచర్లు, పాంప్లెట్లను ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి పంచాలన్నారు. ప్రతి ఇంటిలోని సభ్యుల ఆండ్రాయిడ్ ఫోన్ నందు ఆరోగ్యశ్రీ యాప్‌ను అప్లోడ్ చేయాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ వి. పద్మజ, ఉప స్టాటిస్టికల్ ఆఫీసర్ భానుశ్రీ పాల్గొన్నారు.

మీ రాజకీయాలకు మహిళలను బలి చేస్తారా?

- అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి
- పి.దుర్గాభవానీ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజాప్రతినిధులు వారి రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను బలి చేయడం సమంజసం కాదని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో అత్యాచారానికి గురై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలిని శుక్రవారం రాత్రి మహిళా సమాఖ్య నేతలతో కలిసి ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా దుర్గాభవానీ మాట్లాడుతూ వినుకొండలో చోటు చేసుకున్న ఘటన సమాజానికి మాయని మచ్చ అని అన్నారు. అత్యాచార ఘటనపై కేసు నమోదుకు సంబంధించి పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడి విషయంలో ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. బాధితులకు అండగా ఉండాల్సిన యంత్రాంగం నేరస్తులకు వత్తాసుపలకడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడంలో వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని మండిపడ్డారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు గణనీయంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. 9 నెలల పసిబిడ్డ నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు అత్యధికంగా జరిగిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని నేషనల్ క్రైమ్ రిపోర్ట్స్ బ్యూరో లెక్కలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రం గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఈ గంజాయి మత్తులో యువత మహిళలపై అత్యాచారాలకు, అఘాయిత్యాలకు తెగబడుతున్నారన్నారు. ఇటీవల రేపల్లె, కృష్ణా నది ప్రాంతంలో జరిగిన అత్యాచార ఘటనలలో బాధితులకు పూర్తి స్థాయి న్యాయం జరుగలేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వినుకొండ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, చట్ట ప్రకారం వృద్ధురాలికి తగు న్యాయం చేయాలని, రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో గంజాయిను, సోషల్ మీడియాలో అశ్లీలతను అరికట్టాలని డిమాండ్ చేశారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వాతి, గుంటూరు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వాణి, నగర కార్యదర్శి లక్ష్మి తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

పెద్ది శ్యామలా దేవికి సీపీఐ నేతల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ సీనియర్ నాయకులు, అమరజీవీ కామ్రేడ్ పెద్ది భీమారావు సతీమణి, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పెద్ది శ్రీనివాసరావు మాతృమూర్తి, సీపీఐ సభ్యురాలు పెద్ది శ్యామలా దేవి(90) శనివారం ఉదయం 9 గంటలకు గుంటూరు లక్ష్మీపురం 3వ లైనులోని వారి స్వగృహంలో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి.కిషోర్, కేవీబీ మురళీకృష్ణ, అశోక్ నగర్ సీపీఐ శాఖ కార్యదర్శి ఆకిటి రామచంద్రుడు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, జిల్లా కార్యాలయ కార్యదర్శి వి.రమణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు, జీవీకే ట్రస్ట్ కన్వీనర్ అమ్మిశెట్టి శివ, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి, పీవీ మల్లిఖార్జునరావు, గుంటూరు కళాపరిషత్ కార్యదర్శి బండ్ల పూర్తి, నాయకులు తాండవ కృష్ణ తదితరులు శ్యామలా దేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు.

నారాయణ, రామకృష్ణ సంతాపం..

పెద్ది శ్యామలా దేవి మృతి విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా సీపీఐ సీనియర్ నాయకులు వెలువోలు సాంబశివరావు కూడా తమ సంతాపాన్ని తెలియజేశారు.

విద్యార్థులకు మంకీ క్యాప్స్ పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : జిల్లా పరిషత్తు బాలికల హైస్కూల్‌లో 300 మంది బాలికలకు ఉలెన్ స్కార్ఫ్స్, ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌లో, మండల ప్రజా పరిషత్తు నార్త్ పాఠశాల యాదవపాలెంలో, వెనిగళ్ళ బాపమ్మ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, భవిత సెంటర్ డిజిబిలిటీ స్కూల్ విద్యార్థులకు శనివారం మంకీ క్యాప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థులు చలికి ఇబ్బంది పడకుండా ఉండటానికి పంపిణీ చేశారు. మాతృభాషను, మాతృగ్రామాన్ని, మాతృదేశాన్ని మరువకూడదనే ఉద్దేశ్యంతో మా స్వగ్రామమైన దుగ్గిరాలలో చదువుతున్న విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఈ పంపిణీ కార్యక్రమం చేశామన్నారు. మానవుని సర్వతోముఖాభివృద్ధి కేవలం విద్యతోనే జరుగుతందన్నారు. భావిభారత పౌరులైన విద్యార్థులు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకొని దేశాభివృద్ధిలో పాలు పంచుకొని జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు వన్నె తెచ్చే విధంగా ప్రవర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిక్కిలినేని గాంధి, కొంగర సురేంద్ర, కుర్రా నాగయ్య, గండు పాములు, గండు రాఘవులు, తాడిబోయిన నర్సింహారావు, రవి, చింతమనేని కొండయ్య, నిమ్మగడ్డ శివరామకృష్ణ, శోభాదేవి, గౌసియా బేగం, జగన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు మహేష్ మద్దతు

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రవ్యాప్తంగా తమ వేతనాలు పెంచాలని, కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్/హెల్పర్స్ చేస్తున్న నిరవధిక దీక్షకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మంగళగిరి గౌతమ్ బుద్ధ రోడ్డు వెంబడి గల అంబేద్కర్ బొమ్మ దగ్గర అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్న నిరవధిక దీక్షలో పాల్గొని వారికి పూర్తి మద్దతు తెలియజేసారు. అంగన్‌వాడీ టీచర్లు సేవలు అమూల్యమైనవని వారి డిమాండ్లు సహేతుకమైనవని కాబట్టి ఇకనైనా జగన్‌మోహన్ రెడ్డి వారి డిమాండ్స్ అంగీకరించాలన్నారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు మంద్రు సత్యనారాయణ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కాట్రు ధనుంజయ్, నియోజకవర్గ మీడియా కన్వీనర్ బొడ్డేటి రమేష్, కార్యకర్తలు పాల్గొని అంగన్‌వాడీ టీచర్లకు సంఘీభావం తెలియజేశారు.

నేడు జానపద కళా సదస్సు

విశాలాంధ్ర-తెనాలి : అభ్యుదయ కళాసమితి తెనాలి ఆధ్వర్యంలో నేడు తెనాలి కొత్తపేటలోని అధితి హోటల్ కాన్ఫరెన్స్ హాలులో సాయంత్రం 4 గంటలకు జానపద కళా సదస్సు జరుగుతుందని కన్వీనర్ బొల్లిముంత కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా రచయిత, జానపద కళల విశ్లేషకులు బీరం సుందరరావు, జిల్లా జానపద కళాకారులు పాల్గొంటారన్నారు. రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

SBI స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆర్ఎసిపిసి. 26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004.
ఫోన్ : 0863-2337730, మెయిల్ ఐడి : sbi.05256@sbi.co.in

ఋణగ్రహీతకు సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2)కు లోబడి జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీతలు మరియు హామీదారుల పేర్లు, చిరునామా	ఋణము, ఖాతా నెం. & చెల్లించవలసిన మొత్తము	డిమాండ్ నోటీసు తేది
ఋణగ్రహీతలు : 1) శ్రీమతి ఉప్పాల నళిని, భర్త: దాసరి శ్రీనివాసులు, డోర్ నెం.12-24/1, సాల్మన్ సెంటర్, లక్ష్మీ వేబ్రిడ్జ్ ఎదురు, హస్తినాపురం, చీరాల, బాపట్ల జిల్లా-523155, 2) శ్రీ దాసరి శ్రీనివాసులు, తండ్రి: కొండయ్య, డోర్ నెం.12-24/1, సాల్మన్ సెంటర్, లక్ష్మీ వేబ్రిడ్జ్ ఎదురు, హస్తినాపురం, చీరాల, బాపట్ల జిల్లా-523155.	హోమ్‌లోన్ అకౌంట్ నెంబరు: 38287020653 - రూ.29,89,472/- ; ఎస్‌బిఐ సురక్ష లోన్ అకౌంట్ నెంబరు: 38287132926 - రూ.26,724/-	11-12-2023
	బకాయి మొత్తం: ది.11-12-2023 నాటికి రూ.30,16,196/- (అక్షరాల ముప్పై లక్షల పదహారు వేల నూట తొంభై ఆరు రూపాయలు మాత్రము)	యన్‌పిఎ తేది: 09-12-2023

తనఖా పెట్టబడిన ఆస్తి వివరములు

పార్ట్-1 చర ఆస్తుల యొక్క వివరములు- లేవు, పార్ట్-2 తనఖావుంచబడిన స్థిరాస్తులు.

శ్రీమతి ఉప్పాల నళిని, భర్త: దాసరి శ్రీనివాసులు మరియు శ్రీ దాసరి శ్రీనివాసులు తండ్రి: కొండయ్య గారికి చెందిన తనఖావుంచబడిన ఆస్తులు: షెడ్యూలు ఎ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరులో సర్వే కానటువంటి డి.నెం.579 నందు ఎ.7.00 సెంట్లు, డి.నెం.578, 568/1, 567-ఎ నందు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ సర్వే ప్రకారం గుంటూరు, డి.నెంబర్లు 579, 578/1ఎ, 568/1ఎ, 567-ఎ నందు 18360 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలము (సమీప డోరు నెం.15-15-79) నకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** టి. లక్ష్మీనారాయణ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **ఉత్తరం :** బి. వెంకట సుబ్బయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **తిరిగి తూర్పు :** 40 అ॥ల వెడల్పుగల రోడ్డు నుండి కొంత విస్తీర్ణము మరియు తోట వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి నుండి కొంత విస్తీర్ణము, **దక్షిణం :** తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **తిరిగి తూర్పు :** తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **తిరిగి దక్షిణం :** తోట వెంకటేశ్వర్లుకు చెందిన ఆస్తి, **పడమర :** తొలుసూరి సదాశివరావు, తలారి రాము యొక్క ఆస్తి నుండి కొంత విస్తీర్ణము మరియు మంచికలపూడి శ్రీనివాసరావు యొక్క ఆస్తి నుండి కొంత విస్తీర్ణము, **తిరిగి ఉత్తరం :** గుడి రామ్ ప్రసాద్ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **తిరిగి పడమర :** అత్తోట చలపతిరావుకు చెందిన ఆస్తి, **తిరిగి ఉత్తరం :** అత్తోట శ్రీదేవికి చెందిన ఆస్తి. ఈ హద్దుల మధ్యగల 18360 చ॥గ॥లు లేదా 15351.34 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలము ఆస్తి, దీనిలో

షెడ్యూల్-బి: (ది.01.03.2019 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.2110/2019 ప్రకారం) అవిభాజిత, అనిర్దేశిత 18360 చ॥గ॥లలోని 11642.1/4 చ॥గ॥లు అవిభాజిత, అనిర్దేశిత వాట 47.1/4 చ॥గ॥లు లేదా 39.50 చ॥మీ॥ల విస్తీర్ణము నందలి తిరుమల గార్డెన్‌లోని బి-బ్లాక్ అనగా అంజనాద్రి బ్లాక్‌లోని 4వ అంతస్తులోని 1117 చ॥అ॥ల విస్తీర్ణము గల (కామన్ ఏరియా మరియు అంజనాద్రి బ్లాక్ స్టిల్ట్‌ఫ్లోర్ నందు ఒక కార్ పార్కింగ్‌తో కలిపి) అన్ని ఉమ్మడి మార్గములు, ఉమ్మడి హక్కులు గల ఫ్లాట్ నెం.503. **దీనికి హద్దులు: తూర్పు:** ఉమ్మడి వరండా, **దక్షిణం:** శూన్యాకాశము, **పడమర:** శూన్యాకాశము, **ఉత్తరం:** శూన్యాకాశము.

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు **స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, టుబాకో బోర్డు బ్రాంచ్ (20764), గుంటూరు** నుండి లోన్స్ / అడ్వాన్స్‌ల రూపంలో ఋణసౌకర్యములను పొందియున్నారు. మీరు పొందిన ఋణము తిరిగి చెల్లించనందున **యన్‌పిఎగా** వర్గీకరింపబడి పైన పేర్కొనబడిన సొమ్ము బకాయిగా వున్నది. మేము ఇప్పటికే **11-12-2023** తేదీ గల డిమాండ్ నోటీసు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద తిరుగు రశీదుతో రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించగా అట్టి నోటీసు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరలా నోటీసు జారీచేయడమైనది. సెక్షన్ 13(4) చట్టం క్రింద 60 రోజులలోపు పైన చెప్పిన మొత్తాన్ని చెల్లించని పక్షంలో బ్యాంకుకు తనఖావుంచిన సెక్యూరిటీ ఆస్తులను స్వాధీనం చేసుకొనగలమని మా అభిప్రాయాన్ని తెలియచేయడమైనది.

మీకు ఇస్తున్న సూచనలు : 1) అసలు నోటీసు కాపీ/నోటీసుకు సంబంధించిన సమగ్ర వివరములను, అధీకృత అధికారి నుండి పొందవచ్చునని సూచించబడినది. 2) SARFAESI యాక్ట్ క్రింద తదుపరి చర్యలకు పాల్పడకుండా వుండేందుకు **నోటీసు తేదీ** నుండి 60 రోజులలోపు వడ్డీ, ఖర్చులతో సహా మొత్తం బకాయి చెల్లించవలసి వుంటుంది.

ప్రదేశం : గుంటూరు, తేది : **16-12-2023** సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఎసిపిసి, గుంటూరు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

సంకల్ప సేవా సమితి సభ్యుల దాతృత్వం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని పెద్ద మసీదు బజారుకు చెందిన షేక్ మొహమ్మద్ అనే పక్షవాత బాధితునికి సంకల్ప సేవా సమితి సభ్యులు ఆపన్న హస్తం అందించారు. గత కొన్ని నెలలుగా మంచానికే పరిమితమైన ఆయన దీన పరిస్థితి తెలుసుకొని సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జిమ్ జానీ శనివారం పరామర్శించారు. అనంతరం వారి సంఘంలోని సభ్యుడైన కాంట్రాక్ట్ షేక్ నాగూర్ బాష జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వారి చేతుల మీదుగా బాధితునికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యవసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా షేక్ మొహమ్మద్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జానీ మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం మా మిత్రుల సహకారంతో సంకల్ప సేవా సమితి ప్రారంభించామని కులమతాలకు అతీతంగా నిస్సహాయులకు సాయపడుతూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర-నూజెండ్ల: ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచమంతా చేసుకునే ఏకైక పెద్ద పండుగ క్రిస్మస్ అని వైయస్సార్సీపి నూజెండ్ల మండల కన్వీనర్ నక్క నాగిరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గల బాలయోగి గురుకుల పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన బాటలో మనమంతా నడవాలని సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచి కట్టెంపూడి ఆదిలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎన్ వెంకట రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ఎం నాగేశ్వరమ్మ, వైసిపి సీనియర్ నాయకులు సింగం శ్రీనివాస్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు ఎం రామకృష్ణారెడ్డి, సచివాలయం కన్వీనర్ జీనేపల్లి నాగరాజు, నూజెండ్ల మండలం మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కట్టెంపూడి పిచ్చయ్య, గురుకుల పాఠశాల కమిటీ చైర్మన్ గాలిదిన కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

విశాలాంధ్ర-రొంపిచర్ల: వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు దాటుతున్న బైక్‌ను ఢీకొన్న సంఘటన హైవే రోడ్డు పరిధిలో గల వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద శనివారం జరిగింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన బోడె భ్రమరాంబ(62), గానుగపంట వెంకటేశ్వరరెడ్డి రొంపిచర్ల నుండి తమ స్వగ్రామానికి బైక్ మీద వెళ్ళుతున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో గల హైవే రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుండి మార్టూరు వైపుకు వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి వీరి బైక్‌ను ఢీకొన్నది. ఈ సంఘటనలో బైక్ రోడ్డు పక్కన గల పొలాల్లోకి దూసుకుపోయి తిరగపడటంతో వారి ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారము తెలుసుకున్న ఎస్ఐ కె.పి.రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని వారిని చికిత్స నిమిత్తం నరసరావుపేటలో ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బోడె భ్రమరాంబ (62) మృతి చెందారు. అయితే తీవ్ర గాయాలు అయిన గానుగపంట వెంకటేశ్వరరెడ్డికి సీరియస్‌గా ఉన్నట్లుగా తెలిసింది. కారును, డ్రైవర్ గోరంట్ల ప్రదీప్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా జక్కా

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు జక్కా సీతారామయ్య మాచర్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులయ్యారని బీజేపీ మండల అధ్యక్షులు వెలిదండి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ మేరకు బీజేపీ నాయకులు సీతారామయ్యతో కలిసి మాచర్ల రైల్వే స్టేషన్ విచ్చేసి నియామక పత్రాన్ని రైల్వే అధికారి నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీతారామయ్య ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-సత్తెనపల్లి: క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని పట్టణ సీఐ ప్రభాకర రావు తెలిపారు. శనివారం వావిలాల ఇండోర్ స్టేడియంలో బ్యాట్మింటన్ పవర్ గేమ్ టోర్నమెంట్ ను పట్టణ సీఐ ప్రభాకర్ రావు ప్రారంభించారు. క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని ఈ టోర్నమెంట్ను చేపడుతున్నామని టోర్నమెంట్ ఆర్గనైజర్ వై.రాఘవరెడ్డి తెలిపారు. ఈ ఫ్రెండ్లీ టోర్నమెంట్లో 20 జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, చందు, రవి, సుబ్బయ్య, బాబావలి, మధు వెంకట్ తిరుపతిరావు, కిరణ్, జగదీష్, లాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్.. నగలు స్వాధీనం

విశాలాంధ్ర-మాచర్ల: తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు గురజాల డిఎస్పి పల్లపురాజు తెలిపారు. పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ లో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డిఎస్పి పల్లపు రాజు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా, మండపేట మండలం, ఏడిద గ్రామానికి చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు గత కొంతకాలంగా మాచర్ల, వినుకొండ, మార్కాపురం పట్టణాలలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుండే వాడన్నారు. అందిన సమాచారం పై టౌన్ సీఐ శరత్ బాబు దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ మేరకు పట్టణంలోని గుంటూరు రోడ్ వ్యవసాయ మార్కెట్ వద్ద వాహనాలు తనిఖీ చేపడుతుండగా ఆటో దిగి అనుమానాస్పదంగా పారిపోతున్న కందుల సత్యనారాయణ ను అదుపులోకి విచారించగా పై ప్రాంతాలలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడన్నారు. ఇతని వద్ద 250 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 564 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ శరత్ బాబు, ఎస్సై సౌందర్ రాజన్ సిబ్బందిని డి.ఎస్.పి ఘనంగా అభినందించారు.

ముత్యంకు శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా గుంటూరు ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ముత్యం నియమితులైయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపక రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముత్యంను శనివారం ఘనంగా శాలువా, బొకేలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ముత్యం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ఏఎల్‌సీ చర్చీలను సందర్శించి వారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచేలా కృషి చేస్తానన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి: మారుతి

విశాలాంధ్ర-వినుకొండ: అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. వినుకొండ పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డులో అంగన్వాడీ టీచర్స్ ఐదో రోజు జరుగుతున్న సమ్మె దీక్షా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ఐదు రోజులుగా న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం హామీ ఇచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అనేక దఫాలుగా ప్రభుత్వ అధికారులతో చర్చించినప్పటికీ చర్చలు సఫలం కాని నేపథ్యంలో అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్ళవలసి వచ్చిందని అన్నారు. సమ్మె కార్మికుల హక్కు అన్ని సమ్మె చేస్తున్న వారిని ప్రభుత్వ అధికారులు మంత్రులు, ఆయా ప్రాంతాలలో ఎమ్మెల్యేలు బెదిరించడం ఉద్యోగాలు పీకేస్తామనడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ప్రభుత్వ పెద్దలు ఆ విధంగా మాట్లాడడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలనే వారు నెరవేర్చమని అడుగుతున్నారని రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు, రిటైర్ అయిన ఉద్యోగికి ఐదు లక్షల రూపాయలు బెనిఫిట్ ఇవ్వాలని, రిటైరైన అనంతరం ఆనాటికి ఇస్తున్న వేతనంలో సగం వేతనం పెన్షన్‌గా ఇవ్వాలని అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యుటీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు చేస్తున్న డిమాండ్ న్యాయబద్ధమైనదని పేర్కొన్నారు. వారి సమస్య పరిష్కారమయ్యే వరకు సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఎం అండగా ఉంటాయని, ఎలాంటి బెదిరింపులకు లొంగవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవలపూడి రాము మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరు బాటలో నిలవాలని ఎవరూ వెనక్కు తగ్గొద్దని, అంతిమ విజయం అంగన్వాడి కార్మికులదేనని, మనం పొందుతున్న హక్కులను పోరాటాలు చేసి సాధించినవేనని వారు తెలిపారు ఈ పోరాటంలో మీరు విజయం సాధించేవరకు సంపూర్ణ సహకారాలు అందిస్తామని వారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.ఆంజనేయులు, సీపీఎం నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, కె.హనుమంత రెడ్డి, శివరామకృష్ణ, లక్ష్మీ ప్రసన్న, ఏఐటీయూసీ నాయకులు ఆర్.వందనం, కె.మల్లికార్జున, శారమ్మ, టిడిపి నాయకులు ముంద్రు హనుమంతరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

పోటీచేసేది ఎవరైనా ధీటుగా ఎదుర్కొంటా : రాజేష్ నాయుడు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ నుంచి ఈ సారి పోటీచేసేది ఎవరైనా సరే వైసీపీ నుంచి తాను ధీటుగా ఎదుర్కొంటానని చిలకలూరిపేట నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇన్‌ఛార్జీ మల్లెల రాజేష్ నాయుడు అన్నారు. పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం చిలకలూరిపేట పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాలులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ నాయుడు మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉంది. ప్రజా సమస్యలే కాదు, నాయకులు, కార్యకర్తల సమస్యలు కూడా నాకు తెలుసు. రాజకీయ పరంగా, సమాజీక పరంగా అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతిపక్షనేత మాజీ మంత్రి ఏనాడు అయిన ప్రజల్లోకి వచ్చాడా.. మూడు సంవత్సరాలు పాటు ఆయనను నమ్ముకున్న వారిని కూడా పలకరించిన పాపాన పోలేదని, కరోనా సమయంలో నిలువున అందరిని వదిలేసి..కుటుంబంతో హైదరాబాద్ వెళ్లి దాక్కున్నాడని విమర్శించారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు ఓటరు జాబితాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తా వాసు, సుధారాణి, ఎంపీపీ దేవినేని శంకరరావు, ఝాన్సీ సాగర్, తలతోటి రాణి రత్తయ్య, మండలాల వైయస్ఆర్ సీపీ అధ్యక్షులు గుత్తా వేమలయ్య, గంటా శంకరరావు, మద్దూరి కోటిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్.రఫాని, పట్టణ పార్టీ క్లస్టర్ వన్ అధ్యక్షులు పటాన్ తలహాఖాన్, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, జట్టిబోయిన బొల్లయ్య, చేరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి : ఎంపీపీ

విశాలాంధ్ర-దుర్గి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మండలం అభివృద్ధి పథంలో ఉంటుందని ఎంపీపీ యేచూరి సునీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా యేచూరి సాయి శంకర్ విచ్చేసి మాట్లాడుతూ ఏ ఒక్క కొత్త పథకం గాని కార్యక్రమాలు గాని వచ్చినా ముందుగా మండల స్థాయిలో చర్చించిన అనంతరమే ప్రజల్లోకి తీసుకెళ్ళదామని అధికారులకు సూచించారు. సాయంత్రం వేళ మాచర్ల నుంచి కారంపూడికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మాచర్ల నుంచి ముటుకూరుకు బస్సు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలని తెలిపారు. ఆయా శాఖల పనితీరు, వారి శాఖలో ప్రగతి నివేదికలపై చర్చించారు. అధికారులుగా మీరూ ప్రజాప్రతినిధులుగా మేము అందరం కలిసికట్టుగా పనిచేసి అటూ ప్రభుత్వానికి, ఇటూ మన శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంచిపేరు తీసుకోద్దామని అన్నారు. జడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద మాట్లాడారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అందించిన ప్రగతిని, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇన్చార్జ్ ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా, వ్యవసాయాధికారి అమీర్ రెడ్డి, ఏపీఓ జి.చినవెంకటేశ్వర్లు, సీడీపీఓ లీలావతి, శివప్రసాద్, వెలుగొండారెడ్డి, ఆర్టీసీ ప్రతినిధి లాలునాయక్,రాణి, వెంకటేష్, శివకుమార్, డా.సతీష్, విద్యాశాఖాధికారి బెంజిమెన్, నిర్మల, పద్మజా, నాగేంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆనంద్

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షునిగా జోగి ఆనంద్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు మీరా మాట్లాడుతూ జర్నలిస్టులు అందరూ ఐక్యంతో ఉండి తమ హక్కులు సాధించుకోవాలన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జోగి ఆనంద్‌ను ప్రత్తిపాడు సీపీఐ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐజేయు కౌన్సిలర్ మెంబర్ భక్తవత్సలం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కొత్త రంగాలను అన్వేషించాలి

విశాలాంధ్ర-గుంటూరు : విద్యార్థులు తమను తాము మెరుగుపరుచుకునేందుకు కృషి చేస్తూ తమ పరిజ్ఞానంతో కొత్త రంగాలను అన్వేషించాలని గుంటూరులోని ఐటీసీ లిమిటెడ్ అగ్రి బిజినెస్ డివిజన్ హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ పి.వీరాస్వామి అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మేనేజ్‌మెంట్ పర్స్పెక్టివ్స్(ఎన్‌సీఎమ్‌పీ2023)' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని 'మేనేజ్‌మెంట్ 4.0 ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ అనలిటిక్స్ అండ్ డిజిటల్ మేనేజ్‌మెంట్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీరాస్వామి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో వస్తున్న నూతన ఒరవడులు, పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు పాఠ్య ప్రణాళికలను రూపొందించడం ద్వారా అంతరాలను తగ్గించవచ్చునన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. నిధుల సోర్సింగ్, నిధుల కేటాయింపు వంటి వాటిని నేర్చుకునేలా చేయడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగవుతాయని ఆయన నొక్కిచెప్పారు. పరిశ్రమలోని వ్యక్తులను ఇటువంటి కార్యక్రమాలకు ఆహ్వానించినప్పుడు వారు యువ విద్యార్థుల ప్రతిభ గురించి తెలుసుకుంటారన్నారు. యువత చేసే ప్రతిపనిలోనూ కొత్తదనం కోసం ప్రయత్నించాలన్నారు. దాని వల్ల ప్రతి అనుభవం కలకాలం గుర్తుంటుందని, సులువుగా ఉన్నత శిఖరాలకు చేరే వీలు కూడా కలుగుతుందని అన్నారు.

బధిర విద్యార్థులను ఆదుకోవాలి: సైదా

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : బధిర విద్యార్థులను మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని సీపీఐ సీనియర్ నాయకులు, వినుకొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కామ్రేడ్ సంద్రపాటి సైదా కోరారు. వినుకొండ మండల పరిధిలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల సెయింట్ ఆన్స్ ఉషోదయ బధిరుల పాఠశాల విద్యార్థులకు కామ్రేడ్ సైదా కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సైదా కుటుంబ సభ్యులతో వచ్చి విద్యార్థులకు ప్రత్యేకంగా తయారు చేయించిన వంటకాలను వడ్డించారు. ఆయన మాట్లాడుతూ దురదృష్టవశాత్తు బధిరులుగా ఉన్న విద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు కూడా చక్కగా చదివి భవిష్యత్తులో మార్గదర్శకులుగా తయారుకావాలని ఆయన కోరారు. ప్రతి ఏటా తమ కుటుంబ సభ్యులు, బంధువులు ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాలిక్, షేక్ కిషోర్, సైదా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐసీఓఎన్ గౌరవ కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా డాక్టర్ సుమితా శంకర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా గౌరవ కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సుమితా శంకర్ ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐసీఓఎన్)83వ జాతీయ సదస్సు విశాఖపట్నం నందు జరిగింది. ఈ సదస్సుకు ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సుమితా శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు 5వేల మందికి పైగా ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా ఉన్న నిపుణులు కూడా పాల్గొన్నారు. ఈ సదస్సు నందు డాక్టర్ సుమితా శంకర్ ఎలిఫెంటియాసిస్ (ఫైలేరియాసిస్)పై అద్భుతమైన కేస్ సిరీస్ అందించారు. భారీ ఏనుగు కాళ్లు లాంటి కాళ్ళు ఉన్న రోగులకు ఇది దోహదపడుతుంది. డాక్టర్ సుమితా శంకర్ తన స్వదేశీ డిజైన్ నెగెటివ్ ప్రెజర్ కంప్రెసివ్ థెరపీ (ఎన్‌పీసీటీ),లింఫో-లిపోసక్షన్‌లో ఉపయోగించడాన్ని ఆమె ప్రదర్శించారు. ఆమె ఆవిష్కరించిన ఆవిష్కరణలు వలన అధిక రక్తం పోకుండా మెరుగుపడేందుకు దోహదపడుతుందని నిరూపితమైంది. ఇటువంటి విధానాలను ఆరోగ్యశ్రీలో చేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ సుమితా శంకర్ తక్కువ సమయంలో గుంటూరు జీజీహెచ్‌లో అనేకమంది రోగులకు విలువైన సహాయాన్ని అందించగలిగారు. ప్రైవేట్ ఆసుపత్రులలో ఇటువంటి శాస్త్ర చికిత్సలకు నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయలు వరకు ఖర్చవుతుంది.

నేడు బొంగరాలబీడులో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు : నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి వైద్యం అందటం లేదని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆరోపించారు. శనివారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం అనేది పూర్తిగా విఫలమైందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యం అందించిన హాస్పిటల్స్‌కి నెలలు గడిచిన బిల్లులు అందటం లేదన్నారు. బిల్లు రావడం లేదని హాస్పిటల్స్ వారు ఆరోగ్య శ్రీ ద్వారా వచ్చేవారిని తీసుకునే పరిస్థితి లేదన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు పేదలకి అండగా ఉంటుందని, దానిలో భాగంగా ప్రతివారం పేదలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వారితో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు నగరంలో నిర్వహించిన వైద్య శిబిరాలలో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ నెల 17న ఉదయం 9 .30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బొంగరాలబీడు, వెంగయ్య నగర మెయిన్ రోడ్, పొగాకు కంపెనీ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26న ఆమరణ నిరాహార దీక్ష

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: 2012లో చికిత్స నిమిత్తం హాస్పటల్ కు వచ్చిన కొలకలూరి ధనమ్మకు తనకు వచ్చిన జబ్బుకు కాకుండా వేరే జబ్బుకు చేయవలసిన ఆపరేషన్ చేసి తనను పూర్తి వికలాంగురాలుగా చేసిన హైమ హాస్పిటల్ డాక్టర్ హనుమంతరావు పై చర్యలు తీసుకొని ఆమెకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 26వ తేదీన హాస్పిటల్ ఎదురు ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సమతా సైనిక్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు పాలేటి మహేశ్వర రావు తెలియజేశారు.

గురజాలలోనూ అభ్యర్థి మార్పు తప్పదా..!

విశాలాంధ్ర-గురజాల : రాష్ట్రంలో ఒకపక్క చలి వణుకు పుట్టిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీల అధినేతల మాటలు మాత్రం తమ తమ అభ్యర్థులకు వణుకు పుట్టిస్తున్నాయి. మరో మూడు నెలల్లో అసెంబ్లీ పార్లమెంటరీ ఎన్నికలు ఉంటాయని ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఫిబ్రవరిలో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని సామాజిక మాధ్యమాల ద్వారా జోరుగా ప్రచారం సాగుతుంది. 2019లో ఏప్రిల్ నెలలో ఎన్నికలు జరగగా ఈసారి మాత్రం ఒక నెల ముందుగానే ఎన్నికల జరుగుతాయని విస్తృతంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈసారి 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా మరోసారి ఒంటరి పోరుకు సిద్ధం అవుతుంది. ఇటీవల పార్టీలో రాజీనామాలు, అలకలు, అసంతృప్తుల రాగం ఒకవైపు అధిష్టానాన్ని కలవరపెడుతున్న నేపథ్యంలో ఎలాగైనా సరే 175 నియోజకవర్గాల్లో గెలవాలని, పనితీరును బట్టి నాయకులను కొనసాగించడం జరుగుతుందని అధిష్టానం తేల్చి చెప్పినట్లు తెలుస్తుంది. అందులో భాగంగానే 11 నియోజకవర్గాలకు నూతన ఇన్‌చార్జ్‌లను నియమించడం జరిగిందని, రాబోవు రోజుల్లో మరికొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్ నియామకం జరగవచ్చునని ఇప్పటికే పార్టీ పెద్దలు స్పష్టం చేశారు. దీనిలో భాగంగా గురజాల నియోజకవర్గంలో సైతం అభ్యర్థి మార్పు ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతుంది. నూతన ఓసీ అభ్యర్థి లేదా పాత బీసీ నాయకుడి పేరు తెర మీదకు వస్తున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ మార్పు తథ్యం అన్నట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు. మరోవైపు వైసీపీ సాధికారత బస్సుయాత్ర సైతం గురజాల నియోజకవర్గంలో నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆయనకు-ఈయనకు సఖ్యత లేకపోవడమే బస్సు యాత్ర నిర్వహించకపోవడానికి కారణమని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా గత కొద్ది రోజుల నుంచి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్ సైతం ఈసారి ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టికెట్లు అంటూ ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు ఒకంత కలవర పడ్డట్లు తెలుస్తుంది. పైగా టికెట్ ఆశించే అభ్యర్థి పనితీరు బాగా లేకపోతే పక్కన పెట్టడానికి కూడా పార్టీ అధినేత సిద్ధం అవ్వడంతో అభ్యర్థుల్లో అర్థం కాని పరిస్థితిగా మారింది. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో మూడు అసెంబ్లీ స్థానాల్లో మార్పు తప్పదని ప్రచారంలో జరుగుతున్న నేపథ్యంలో ఆ ముగ్గురు ఎవరు అనేది టీడీపీ నేతల్లో అలజడి మొదలైంది. పైగా పార్టీ యువ నాయకుడు నారా లోకేష్ సైతం గురజాల నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. అయితే 2024 ఎన్నికల్లో గురజాల నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఇరు పార్టీలు పొత్తులో భాగంగా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.

చందా లక్ష్మమ్మకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని పెద్ద మసీద్ బజార్‌కు చెందిన చందా లక్ష్మమ్మపై అత్యాచారం చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినుకొండ పట్టణానికి చెందిన వృద్ధ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నిందితుడు సెల్ఫోన్లో న్యూడ్ వీడియోలను చూస్తూ ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడని, ఆమెను కుమారుడు, కోడలు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారని. నిందితుడిపై కేసు పెట్టినప్పటికిని పోలీసులు ఇంతవరకు అతనిని అరెస్టు చేయకపోవడం దారుణం అని అన్నారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ ఆమెను పరామర్శించి నిందితున్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారని, శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, పల్నాడు జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి కోలా స్వాతి గుంటూరు జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు వాణి తదితరులు బాధితురాలని పరామర్శించి వెంటనే ఆమెకు న్యాయం చేయాలని, నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బాధితురాలికి ప్రభుత్వం ఎక్స్రేషియా 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారని కావున ప్రభుత్వం పోలీసు అధికారులు వెంటనే స్పందించి నిందితుడిని కస్టడీలకు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము పాల్గొన్నారు.

ఉచిత శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-వినుకొండ రూరల్: డాక్టర్ పాల లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-1, గ్రూప్-2 ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్టడీ సర్కిల్ నిర్వాహకులు డాక్టర్ పాల వెంకట లక్ష్మయ్య కోరారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ సూచనల మేరకు జిల్లా నిరుద్యోగుల కోసం డాక్టర్ లక్ష్మయ్య వినుకొండ ప్రాంతంలో ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. వినుకొండ మండల పరిధిలోని చీకటిగలపాలెం వద్దగల భ్రమరా టౌన్షిప్ నందు శనివారం శిక్షణ తరగతులను డాక్టర్ లక్ష్మయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా తో పాటుగా, మాజీ ప్రభుత్వ కార్యదర్శి కెవి సత్యనారాయణ విజువల్ మాధ్యమం ద్వారా పాల్గొని విలువైన సూచనలను సలహాలను అందించారు. అలాగే ఇటీవల ఐఏఎస్ నందు రాణించిన డాక్టర్ లక్ష్మయ్య శిశు బృందం సైతం తమ సలహాలను అందజేశారు. జిల్లాతో పాటు ముఖ్యంగా వినుకొండ ప్రాంతంలోని విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జనసేన సత్తెనపల్లి సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు అన్నారు. శనివారం అంగన్వాడీలు చేస్తున్న ధర్నాకు అయన సంఘీభావం తెలిపారు. అనంతరం అయన మాట్లడుతూ ప్రభుత్వం మీ సమస్యను పరిష్కరించలేదున మీరు రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేస్తున్నారన్నారు. రాజకీయ లబ్ది కోసం కొన్ని పార్టీలు ప్రయత్నం చేస్తాయి అన్న మాటల్లో వాస్తవం ఉందన్నారు. గర్భిణీలకు మంచి ఆహారం అందించి తల్లీ, బిడ్డ ఆరోగ్యం ఉండటానికి అంగన్వాడీలు కృషి చేస్తారన్నారు. సమాజానికి ఎన్నో విధాలుగా అంగనవాడి టీచర్లు ఉపయోగపడుతున్నట్లు తెలిపారు కనీసం జీతం లేకుండా, రోజుకు రూ.300 నుంచి రూ.400 ఇస్తే వాళ్లకి ఎలా సరిపోతాయని బొర్రా ప్రశ్నించారు. సమాజానికి ఉపయోగపడే ఎన్నో పనులు చేస్తున్న నేపథ్యంలో అంగన్‌వాడీల జీతాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి సాంబశివరావు సత్తెనపల్లి మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరావు, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు బత్తుల కేశవ, జనసేన నాయకులు గట్టు శ్రీదేవి, చిలకా పూర్ణ, చిలకా సత్యం, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర-గురజాల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగనవాడి కార్యకర్తలు చేస్తున్న నిరవధిక దీక్ష అయిదో రోజుకు చేరింది. శనివారం అంగన్వాడీలు వినూత్నంగా తమ కళ్ళకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వంపై నిరసన తెలియజేశారు. అంగన్వాడీల నిరవధిక దీక్షకు మద్దతుగా భారత కమ్యూనిస్టు పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు ఐదు రోజుల నుంచి దీక్షలు చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరించడం సరైన పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. తక్షణమే అంగన్వాడీల డిమాండ్స్ నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో సి.ఐ.టి.యుతో కలిసి అంగన్వాడీ కార్యకర్తలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తావని హెచ్చరించారు. ఈ నిరసనలో జనసేన నాయకుడు అంకారవు, సిఐటియు నేతలు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని జనసేన సత్తెనపల్లి సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం తాలూకా సెంటర్లో ధర్నా చేస్తున్న అంగన్వాడీలకు బొర్రా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి సాంబశివరావు, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరావు, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు బత్తుల కేశవ, జనసేన నాయకులు గట్టు శ్రీదేవి, చిలక పూర్ణ, చిలక సత్యం, ఖాసీం తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఫిరంగిపురం : ఫిరంగిపురంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేస్తున్న సమ్మె శనివారం 5వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలకు 2017 నుంచి రావలసిన బిల్లులను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేయాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లించాలని కోరుతూ నల్ల రిబ్బన్లు కళ్ళకు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు బైరవగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్నటువంటి న్యాయ మైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, యూనియన్ నాయకులు పి.రజిని, మల్లేశ్వరి, నందిని, సీతామాలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-తాడేపల్లి: సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె శనివారం 5 వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు అంగన్వాడీలు చేస్తున్న దీక్షకు టీఎన్ఎస్ఎఫ్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కంభం సాయిచంద్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గ కమిటీ మద్దతు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు రాయపూడి కిరణ్, అధికార ప్రతినిధి మన్యం రవి, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి మాగంటి కళ్యాణ్ మద్దతు తెలిపారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

ఎమ్మెల్యేను కలసిన హనిమిరెడ్డి

విశాలాంధ్ర-అద్దంకి; నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన పాణెం హనిమిరెడ్డి శనివారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని ఒంగోలులోని బలరాం స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు చర్చించుకొని తన గెలుపునకు సహకరించాలని బలరాంను హనిమిరెడ్డి కోరారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు మేడం గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

విశాలాంధ్ర-అద్దంకి; ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ప్రజా వైద్యశాల వైద్యులు డా.యలగాల హనుమంతరావు సూచించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సాధన జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మోటివేషన్,పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహనా సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంపైనే గురి ఉంచి, చెడు ఆకర్షణలకు లోను కాకుండా ఇష్టపడి, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తేవాలన్నారు. సృజన సాహితీ సంస్థ అధ్యక్షులు గాదేపల్లి దివాకరదత్తు మాట్లాడుతూ విద్యార్థి మొదటి చివరి లక్ష్యం చదువే కావాలని, బాగా సాధన చేసి ఎంచుకున్న లక్ష్యం చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మలాది శ్రీనివాసరావు, కార్యదర్శి చప్పిడి వీరయ్య, పూర్వ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల శ్రమను దోపిడీ చేస్తున్న జగన్

విశాలాంధ్ర-అద్దంకి ; అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసి మహిళల శ్రమను దోపిడీ చేస్తున్న మోసకారి జగన్‌రెడ్డి ప్రభుత్వం అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు శనివారం ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నా అక్క, నా చెల్లి అంటూ వారికి తోడుగా ఉంటా నంటూ బూటకపు మాటలతో జగన్‌రెడ్డి అంగన్వాడీ మహిళలను నమ్మించి మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదని, దీనిని టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి మన ప్రభుత్వం రాగానే వారికి తగిన న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

క్రికెట్ జట్టుకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-పర్చూరు: స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 క్రికెట్ జట్టుకు స్థానిక శ్రీశాతవాహన హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనారు. వారిని శనివారం స్థానిక ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సబ్ సెంటర్ నందు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు షేక్ మహ్మద్ అఖిల్, దుద్దు ప్రేమ్‌చరణ్, చల్లా ఇస్సాకు, బాణావత్ గణపతి నాయక్, చింతా స్టీఫెన్‌పాల్‌ను పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. అలాగే ఏసీఏ జోనల్ స్థాయి అండర్-14 విభాగంలో షేక్ ఖమ్మద్దీన్‌ఖాన్, చల్లా జేమ్స్ ఎంపికైనారు. కోచ్ తులసి శివనాగేశ్వరరావు, పాఠశాల కరస్పాండెంట్ తేళ్ళ వెంకటరాము, డైరెక్టర్ తేళ్ళ అనురంజని, ప్రధానోపాధ్యాయులు కొప్పుల జాన్‌బోస్ అభినందించారు. శిక్షణకుడు శివనాగేశ్వరరావును ప్రత్యేకంగా ప్రశంసించారు.

గిరిజనుల గుడిసెలకు పట్టాలు అందజేత

విశాలాంధ్ర - కర్లపాలెం : రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని తాహసిల్దార్, రెడ్ క్రాస్ మండల అధ్యక్షులు కేశవ నారాయణరావు అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ఉన్న గిరిజనలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుడారానికి పట్టాలు, నిత్యవసర కిట్టును అందించారు.ఈ నాలుగు గ్రామాలలో 66 కుటుంబాలకు అందించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బిఎస్ నారాయణ బట్టు, మండల చైర్మన్ ఈ.పోలీసు రావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు రమణబాబు, ఎం.పరమానందకుమార్, పి.ధనుంజయరావు, జి.వెంకటరెడ్డి, ఐ.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల - పర్చూరు రహదారిలో రోడ్డుపైకి ముళ్ళ చెట్లు అల్లుకుపోయి రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం ఒక ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దంపతుల వాహనం ఎదురుగా వస్తున్న వాహనం ప్రక్కకు తప్పించబోయి ముళ్ళ చెట్లకు తగిలి ప్రమాదాన్ని గురైన సంఘటన చోటు చేసుకుంది. ప్రజలు ప్రాణాలు పోతే మాకేంటి అనే చందాగా ఆర్ అండ్ బీ అధికారుల తీరు ఉందని ప్రజలు మండిపడుతున్నారు.

పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర - చీరాల : క్రిస్టమస్ పండుగ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ప్రజా వేదిక ఐక్య క్రిస్టియన్ జేఏసీ వ్యవస్థాపకులు గుమ్మడి యేసు రత్నం అన్నారు.శనివారం వేటపాలెం మండలం జబ్బర్ కాలనీలోనీ షాలేము ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించి,పేదలకు చీరలు పంపిణీ చేశారు.పాస్టర్ ఎనిబేర ఆరోగ్యం ప్రార్ధన చేయించారు.ఈ కార్యక్రమంలో తేల భాగ్యమ్మ,లూథియమ్మ, విజయమ్మ,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక

విశాలాంధ్ర - చీరాల : క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవవలసిన అవసరం ఉందని అలా నడిచినప్పుడే సమాజంలో ప్రతి ఒక్కరికి ప్రేమతత్వం ఏర్పడుతుందని రిటైర్డ్ లైబ్రేరియన్ జయాశీలరావు అన్నారు.కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్,ప్రిన్సిపల్ పి.సునీతల పర్యవేక్షణలో రిటైర్డ్ లైబ్రేరియన్ జయశీలరావు అధ్యక్షతన ఎస్.ఎం.ఎల్.జె కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ప్రేమ,ఆప్యాయతలతో మెలగాలని, స్నేహభావంతో మనిషికి మనిషి తోడుగా నిలబడాలన్నారు.క్రీస్తు చూపిన శాంతిమార్గంలో నేటి యువత ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపల్ పి.సునీత,అధ్యాపక సిబ్బంది గారపాటి మంజులాదేవి,సుమ,చిన్నపాప,షీలా, షిషోరా,ఖాదరి,డాక్టర్ రత్నకుమార్,కాంతి కరుణశ్రీ, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ ఐక్య ఉద్యమాలు చేస్తాం

బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర-అద్దంకి : అంగన్‌వాడీల న్యాయమైన సమ స్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు వారికి అండగా ఉండి అన్ని కార్మిక, ప్రజాసంఘాలతో కలసి ఐక్య ఉద్యమాలు చేస్తామని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని అద్దంకి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె శనివారానికి 5వ రోజుకు చేరింది. సమ్మెకు ఏఐటీయూసీ తమ సంఘీభావం తెలిపింది. సమ్మె శిబిరంలో పాల్గొన్న బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై పని ఒత్తిడి పెంచి తీవ్ర ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం కనీస వేతనం చెల్లించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమ్మె విఫలం చేయడానికి బెదిరింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. అంగన్‌వాడీలు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసి అద్దంకి నియోజకవర్గ అధ్యక్షులు కెఎల్‌డి ప్రసాద్, సీఐటీయూ నాయకులు గంగయ్య, సీఐటీయూ అద్దంకి మండల అధ్యక్షురాలు జి.శారద తదితరులు పాల్గొన్నారు. ముందుగా పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎస్‌కె సాబ్జి చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అంగన్వాడీల ఉద్యమంలో ఉద్రిక్తత

ఎండిఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఏఐటీయూసీ

విశాలాంధ్ర - రేపల్లె : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించ కుండా,సెంటర్లను స్వాధీనం చేసుకుంటామని అధికారులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చెయ్యటంతో, మండల అభివృద్ధి అధికారినికి,ఏఐటీయూసీ నాయకులకు మధ్య వాగ్వాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది.మండలంలోని బేతపూడిలో ఉన్న అంగన్వాడీ సెంటర్ తాళాలు పగల గొట్టేందుకు ఎంపీడీఓ వెళ్లారని తెలుసుకున్న అంగన్వాడీలు,ఏఐటీయూసీ నాయకులు వెళ్లి అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో ఎంపిడివో శివపార్వతికి ఏఐటీయూసీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.పట్టణ సిఐ నజీర్ బేగ్ తన సిబ్బందితో వెళ్లి ఇరువురితో చర్చించారు.అక్కడ నుండి శిబిరానికి చేరుకున్న అంగన్వాడీలు,ఏఐటీయూసీ నాయకులు మండల అభివృద్ధి కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాగంజానేయులు,బాలాజీ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించవలసిన అధికార పార్టీ నాయకులు నోటికి హద్దు అదుపు లేకుండా మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం సభ్య సమాజానికి సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అంగనవాడిలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చపోగా రాజకీయ వేధింపులకు గురిచేస్తూ అంగన్వాడీలను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల తాళాలను అధికారుల చేత బద్దలు కొట్టించడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు.ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.అంగనవాడి కేంద్రాల తాళాలను పగలగొడితే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జి.నాగమల్లేశ్వరమ్మ,అసోసియేషన్ నాయకులు వై.కనకదుర్గ, అరుణశ్రీ ఉమా,జి.లక్ష్మి, అనూష,సునీత, వాణి, త్రివేణి, నాగలక్ష్మి,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంలో మరణించిన సైనికులకు తాండ్ర నివాళి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : విజయ్ దివాస్ వేడుకలను పట్టణంలోని విజయలక్ష్మి పురంలోని మాజీ సైనిక జిల్లా సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాజీ సైనికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర మాట్లాడుతూ 3 డిసెంబర్ 1971న పాకిస్తాన్ సైన్యం అన్యాయంగా 11 భారతీయ వాయుసేన స్థావరాలపై దాడి చేయగా,ప్రతీకారంగా భారతీయ సైన్యం వీరోచితంగా పోరాడి పాకిస్తాన్ సైన్యాన్ని సుమారుగా పది వేల మందికి పైగా మట్టి కరిపించగా మిగిలిన పాకిస్తాన్ సైన్యం 94 వేల మంది భారతీయ సేనల దాడికి తట్టుకోలేక భారత సైన్యం ముందు లొంగిపోయి ఆత్మసమర్పణ చేసిన రోజు డిసెంబర్ 16ను విజయ్ దివాస్‌గా ప్రకటించారన్నారు.భారత దేశానికి విజయం చేకుర్చటానికి నాలుగు వేల మంది సైనికులు తమ ప్రాణాలను అర్పించటం చాలా గొప్ప విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా సీనియర్ మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు,తోట దుర్గా రావు,సి.హెచ్ కృష్ణారావు,పసుపులేటి ప్రసాద్,పావులూరి తాండవయ్య,డి.వెంకటేశ్వర్లు, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని మత్స్యకారులు వృద్ధిలోకి రావాలని డాక్టర్ దార్విన్ అన్నారు.మండలంలోని ఓడరేవు గ్రామంలో వైయస్ఆర్ మత్స్య సాగు బడి కార్యక్రమాన్ని మత్స్య సహాయకులు డాక్టర్ దార్విన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డ్ యొక్క రుణ సదుపాయంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు.

భారత వాయుసేన సూర్యలంక స్టేషన్ నుంచి క్షిపణి ప్రయోగములు జరుపుతున్న సందర్భంగా డిసెంబర్ 3 నుండి 22 తేదీ వరకు తీర ప్రాంతము నుండి 100కి.మీ పరిధిలో మత్స్యకారులు ఎవరూ మత్స్యవేట నిమిత్తం సముద్రంలో ప్రవేశించవద్దన్నారు.ఈ కార్యక్రమంలో సాగరమిత్ర ఎల్.ప్రియాంక,ఓడరేవు మత్స్యకార సొసైటి సభ్యులు మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై గ్రామస్తుల ఆగ్రహం

విశాలాంధ్ర - యద్దనపూడి : తెలుగుదేశం పార్టీ మద్దతుదారుల ఓట్లు తొలగింపే లక్ష్యంగా పదే పదే ఫారం-7 దరఖాస్తులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామంలో మొత్తం 230 ఓట్లు ఉండగా 25 ఓట్లకు ఫారం-7 దరఖాస్తు పెట్టారని గ్రామస్తులు తెలిపారు.గతంలో 55 ఓట్లు పెట్టగా వాటికి ఆధారాలను అధికారులకి అందజేశామన్నారు.ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న వారి ఓట్లు కూడా ఫారం-7 పెట్టినట్లు తెలిపారు.ఫారం-7 పెట్టిన వారు ఎవరో కూడా గ్రామస్తులకు తెలియదని గ్రామం తోటి సంబంధం లేని వారు దరఖాస్తులు పెట్టినట్లు తెలిపారు.ఓట్లు తీసివేయమని దరఖాస్తులు ఇచ్చిన వారిపై సరయిన విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

గాయపడిన కార్యకర్తకు గాదె పరామర్శ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ప్రమాదంలో గాయపడిన కొత్తపాలెనికి చెందిన వైసీపీ కార్యకర్త పిట్టు సముద్రాల రెడ్డిని వైసీపీ నియోజకవర్గ నాయకులు గాదె మధుసుధన్‌రెడ్డి శనివారం పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఆయనతో గోవతోటి విజయ్,దోమ నాగేశ్వర రెడ్డి,మద్దాల డేవిడ్, దేగల రవిరెడ్డి,అనిల్,అశోక్ రెడ్డి,పులి నాగేశ్వరరావు గ్రామ పెద్దలు గాదెయువసేన పాల్గొన్నారు.

వైకాపా పాలనలో అట్టడుగున గిరిజన సంక్షేమం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వైకాపా ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాల వల్ల గిరిజనుల సంక్షేమం అట్టడుగు స్థాయికి చేరిందని నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు.పార్లమెంట్ ఎస్టీ సెల్ కమిటీ ఆధ్వర్యంలో తెదేపా కార్యాలయంలో కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. గిరిజనుల అభివృద్ధి,సంక్షేమానికి సంబంధించిన 18 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసి వారికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు.రాష్ట్రంలో గిరిజనుల జీవన ప్రమాణాలు పూర్తిగా అడుగంటాయని ఆవేదన వ్యక్తం చేశారు.వైకాపా పాలనలో గిరిజనుల మీద దాడులు,అఘాయిత్యాలు బాగా పెరిగిపోయాయన్నారు.గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు నిర్దేశించే గిరిజన ఉపప్రణాళిక నిధులు రూ.5355 కోట్లను దారి మళ్లించి గిరిజన ద్రోహిగా జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచారన్నారు.ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి శ్రీను,గుర్రంకొండ శ్రీనివాసులు,దేవరకొండ వెంకటేష్,అద్దూరి వెంకటేశ్వర్లు, మానికల శ్రీను,మాణికల శ్రీను,రాచూరి కుమార్,ఇండ్ల శ్రీనివాసరావు,చౌటూరి శ్రీనివాసరావు,సుళ్లూరి శ్రీను,సుళ్ళూరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె

విశాలాంధ్ర - మార్టూరు : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు న్యాయమైన కోరికలను తీర్చాలని చేస్తున్న సమ్మెను విరమింప చేసేందుకు ప్రభుత్వం మొండివైఖరి వీడి వారి న్యాయమైన కోరికలు తీర్చకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ఫ్యాక్టో కోశాధికారి చింతల సుబ్బారావు అన్నారు.అంగన్వాడీలు మండల కార్యాలయం వద్ద చేస్తున్న ధర్నాకు శనివారం సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయబద్ధమైన కోరికలు కనీస వేతనం 26 వేల రూపాయలు,ఐదు లక్షల గ్రాడ్యువిటీ అంతర్గత ప్రమోషన్లు అంగన్వాడీ సెంటర్లకు పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.హనుమంతరావు ఫ్యాక్టో నాయకులు కందిమల్ల రవిబాబు,ఈ దేవరాజు సయ్యద్ ఇమాంస రైస్ సంగం నాయకులు జి.మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - బల్లికురవ : గత నాలుగు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు న్యాయమైన కోరికలను తీర్చాలని చేస్తున్న సమ్మెను విరమింప చేసేందుకు ప్రభుత్వం మొండివైఖరి వీడి వారి న్యాయమైన కోరికలు తీర్చకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్ హెచ్చరించారు.గత నాలుగు రోజుల నుండి అంగన్వాడీలు బల్లికురవ తాసిల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న ధర్నాకు శనివారం సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా శ్యామ్యూల్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయబద్ధమైన కోరికలను కనీస వేతనం రూ.26 వేల, ఐదు లక్షల గ్రాడ్యువిటీ అంతర్గత ప్రమోషన్లు అంగన్వాడీ సెంటర్లకు పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు.ఉద్యోగుల ఉపాధ్యాయుల అంగన్వాడీల పట్ల చిన్నచూపు చూస్తుందని వారి డిమాండ్ల పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తుందనరు.ప్రభుత్వం రాబోయే రోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి కేఎల్ డి.ప్రసాద్,నిమ్మల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల ధర్నాకు తరలిరావాలి: శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : డిసెంబర్ 20న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే గ్రామీణ కష్టజీవుల ధర్నాకు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్లి భాగ్య శ్రీధర్ పిలుపునిచ్చారు.పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు కల్పించటం ,కరువు నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.భారత రాజ్యాంగం ఆర్టికల్ 41 ప్రకారం పనిచేసే హక్కుకు అనుకూలంగా పని కల్పనను చట్టబద్ధం చేస్తూ 2005లో కమ్యూనిస్టు పార్టీ మద్దతు ఏర్పాటు చేసిన ఆనాటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించిందన్నారు.దీని ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ పథకం 100 రోజులు పని కల్పించి వేతనం ఇవ్వటం వలన వలసలు నివారించవచ్చునని పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. గ్రామాల్లో కనీసం 10 రోజులు పని కల్పించడం లేదని చేసిన పనికి కూలి ఇవ్వలేని విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైతులు, కౌలు రైతులు పంటల మునిగిపోవటంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంటు చార్జీలు నిత్యవసర సరుకులు విపరీతంగా పెంచి ఇబ్బందులు గురిచేస్తున్నారని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి పనులు 200 రోజులు కల్పించి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, కోటి దేవేంద్రరెడ్డి, కంచర్ల యేసురత్నం,పి.శ్రీనివాసరావు,ఫణి, కీర్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - వేమూరు : అంగన్వాడి వర్కర్ల న్యాయమైన కోరికల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా,మొండి వైఖరితో వ్యవహరిస్తుందని మాజీమంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు విమర్శించారు.అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ చేస్తున్న దీక్షలు శనివారంతో ఐదో రోజుకు చేరాయి.నక్కా ఆనందబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉండగా అంగన్వాడి వర్కర్లకు రెండు పర్యాయాలు వేతనాలు పెంచిన సందర్భాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలకు సొంత భవనాలు నిర్మించిందన్నారు.ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హక్కులను కాలరాస్తు సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న ఆందోళనలను తొక్కి పారేస్తున్నారు. తక్షణం న్యాయమైన అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆయనతో పాటు పార్టీ నాయకులు జొన్నగడ్డ విజయ్ బాబు, మైనేని మురళీకృష్ణ, గొట్టిపాటి నరహరి ప్రసాద్, అంగన్వాడి యూనియన్ నాయకురాలు కామేశ్వరి, మండల శాఖ అధ్యక్షురాలు బసవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, కరణంను కలిసిన హనిమిరెడ్డి

విశాలాంధ్ర - బల్లికురవ : అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన ఇంచార్జ్ పాణెం హనిమిరెడ్డి శనివారం ఒంగోలులో చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, కూకట్లపల్లి గ్రామ సర్పంచ్ అయ్యప్పరెడ్డి, పార్లమెంటు జనరల్ సెక్రటరీ అంజనిప్రసాద్ రెడ్డి,శ్రీనివాస రెడ్డి,పులిపాటి వీరారెడ్డి తదితరులున్నారు.

ప్రకటన

నా క్లైయింట్ అయిన సిహెచ్ పద్మ, వేటపాలెం మండలం బాలాజీ నగర్ బాపట్ల జిల్లా వారి నుండి సంజాయిషీ పొంది ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా

నా క్లైయింట్ ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి క్రయధనము చెల్లించి కొనుగోలు చేసినది తన సోదరీ అయినా కసుకుర్తి సుజాత నా క్లైయింట్‌కు తెలియకుండా ఈ షెడ్యూల్ ఆస్తిని అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నదని తెలియుచున్నది. ఈ ప్రాపర్టీ సర్వే నంబర్ 219 / 6 లో ఇల్లు ఉన్నది డోర్ నెంబర్ 14-15 బాలాజీ నగర్ వేటపాలెం గ్రామము మా క్లైంట్ యొక్క సిస్టర్ కసుకుర్తి సుజాత ఈ ఆస్తిని అమ్మటానికి ప్రయత్నిస్తున్నది ఒకవేళ సుజాత ఈ ఆస్తిని అమ్మిన యెడల ఆమెపై సివిల్ మరియు క్రిమినల్ కేసులతో చర్యలు తీసుకుంటామని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాము.

చీరాల
02-12-2023

ఏ రామకృష్ణ ,
న్యాయవాది, చీరాల
సెల్ :7093282804

ఎస్పీకి కమాండేషన్ గోల్డ్ డెస్క్ మెడల్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కమాండేషన్ గోల్డ్ డెస్క్ మెడల్ రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. 2022 సంవత్సరంలో జిల్లాలో దిశ, బెస్ట్ కన్విక్షన్ పోలీసింగ్, ముఖ్యమైన కేసులకు సంబంధించి దర్యాప్తు, కోర్టు షెడ్యూల్ మేరకు ట్రైల్ జరిపించి, స్వయంగా కేసు పురోగతి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నేరస్తులకు శిక్ష పడే విధంగా తీసుకున్న చర్యలకు, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి, జిల్లాలో నాటుసార, గంజాయి కట్టడి చేసినందుకు గాను, శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకున్న చర్యలకు కమాండేషన్ గోల్డ్ డెస్క్ మెడల్ ను అందుకున్నారు. అదే విధంగా జిల్లాలోని చుండూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించే ఏఎస్ఐ 313 రాజ్ కుమార్ నేర చేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు డిజిపి చేతుల మీదుగా బ్రోంజ్ మెడల్ ను అందుకున్నారు.

టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం : వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. పట్టణంలోని 10వ వార్డు ఆంధ్రకేసరి నగర్, ప్యాడిసన్‌పేటలో ఇంటింటికి తెలుగుదేశం మీ మాట నా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి అరాచక పాలన రాజ్యమేలుతుందని అలాంటి పాలనను అంతం చేసే విధంగా రాబోయే రోజుల్లో ప్రజలు తీర్పు ఉంటుందన్నారు. ఒకపక్క వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు పాములతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. అరాచక పాలన ఎక్కువకాలం సాగదని రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 10వ వార్డులోని డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాలు, సిమెంటు రోడ్డులు వేసి అభివృద్ధి చేస్తానని వేగేశన ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కన్నా పరామర్శ

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రముఖ పారిశ్రామికవేత్త కరణం వెంకట కోటేశ్వరరావు, కరణం పట్టాభి సీతారామారావు తల్లి రామ తీర్థమ్మ మృతి చెందటంతో ఆమె దశదిన కర్మకు టిడిపి నాయకులు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ,చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణ మూర్తి, జనసేన నాయకులు హాజరై కరణం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనతో పెరవలి రాఘవరావు, కోటిరావు,జవహర్ బాబు,బసవయ్య, చందు, రంజిత్, బాబీ, రాయపూడి బ్రహ్మయ్య, వీరయ్య, పద్మారావు, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేర్చండి

విశాలాంధ్ర - చీరాల : సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని సమగ్ర శిక్షలో గత12 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు అన్నారు.రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల మేరకు మండల ఉద్యోగులు మోకాళ్ళపై కూర్చుని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ అధికారం చేపట్టాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని దశల వారీగా ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి నేటికి చేయలేదన్నారు.కనీసం నెలవారీ వేతనాలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని,అప్పుల పాలై ఆత్మహత్య చేసుకునే స్థితిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారన్నారు.ఇప్పటికే డిసెంబర్ 11న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి, డిసెంబర్16 నుండి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని స్థాయి ఉద్యోగులు పెన్ డౌన్,మౌస్ డౌన్ విజయవంతంగా చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఖచ్చితమైన హామీ ఇవ్వక పోతే డిసెంబర్ 20న నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు.

రేపు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : దళిత బహుజన రిసోర్స్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకి ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణపై జిల్లాస్థాయి సదస్సు చీరాల ఎన్జీవో హోంలో నిర్వహిచనున్నట్లు డిబిఆర్‌సిటీ కో-ఆర్డినేటర్ ఎన్.శ్రీలత తెలిపారు. ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు చీరాల ఎన్జీవో హోంలో జరగనున్న సదస్సులో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనాలని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

SBI స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆర్ఎసిపిసి, 26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004.
ఫోన్ : 0863-2337730, మెయిల్ ఐడి : sbi.05256@sbi.co.in

ఋణగ్రహీతకు సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2)కు లోబడి జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీతలు మరియు హామీదారుల పేర్లు, చిరునామా	ఋణము, ఖాతా నెం. & చెల్లించవలసిన మొత్తము	డిమాండ్ నోటీసు తేది
ఋణగ్రహీతలు : 1) శ్రీమతి ఉప్పాల నళిని, భర్త: దాసరి శ్రీనివాసులు, డోర్ నెం.12-24/1, సాల్మన్ సెంటర్, లక్ష్మీ వేబ్రిడ్జ్ ఎదురు, హస్తినాపురం, చీరాల, బాపట్ల జిల్లా-523155, 2) శ్రీ దాసరి శ్రీనివాసులు, తండ్రి: కొండయ్య, డోర్ నెం.12-24/1, సాల్మన్ సెంటర్, లక్ష్మీ వేబ్రిడ్జ్ ఎదురు, హస్తినాపురం, చీరాల, బాపట్ల జిల్లా-523155.	హోంలోన్ అకౌంట్ నెంబరు: 38287020653 - రూ.29,89,472/- ఎస్‌బిఐ సురక్ష లోన్ అకౌంట్ నెంబరు: 38287132926 - రూ.26,724/-	11-12-2023
	బకాయి మొత్తం: ది.11-12-2023 నాటికి రూ.30,16,196/- (అక్షరాల ముప్పై లక్షల పదహారు వేల నూట తొంభై ఆరు రూపాయలు మాత్రము)	యన్‌పిఎ తేది 09-12-2023

తనఖా పెట్టబడిన ఆస్తి వివరములు

పార్ట్-1 చర ఆస్తుల యొక్క వివరములు- లేవు, పార్ట్-2 తనఖావుంచబడిన స్థిరాస్తులు.

శ్రీమతి ఉప్పాల నళిని, భర్త: దాసరి శ్రీనివాసులు మరియు శ్రీ దాసరి శ్రీనివాసులు తండ్రి: కొండయ్య గారికి చెందిన తనఖావుంచబడిన ఆస్తులు: షెడ్యూలు ఎ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరులో సర్వే కానటువంటి డి.నెం.579 నందు ఎ.7.00 సెంట్లు, డి.నెం.578, 568/1, 567-ఎ నందు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ సర్వే ప్రకారం గుంటూరు, డి.నెంబర్లు 579, 578/1ఎ, 568/1ఎ, 567-ఎ నందు 18360 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలము (సమీప డోరు నెం.15-15-79) నకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : టి. లక్ష్మీనారాయణ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, ఉత్తరం : బి. వెంకట సుబ్బయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, తిరిగి తూర్పు : 40 అ॥ల వెడల్పుగల రోడ్డు నుండి కొంత విస్తీర్ణము మరియు తోట వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి నుండి కొంత విస్తీర్ణము, దక్షిణం : తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, తిరిగి తూర్పు : తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, తిరిగి దక్షిణం : తోట వెంకటేశ్వర్లుకు చెందిన ఆస్తి, పడమర : తొలుసూరి సదాశివరావు, తలారి రాము యొక్క ఆస్తి నుండి కొంత విస్తీర్ణము మరియు మంచికలపూడి శ్రీనివాసరావు యొక్క ఆస్తి నుండి కొంత విస్తీర్ణము, తిరిగి ఉత్తరం : గుడి రామ్ ప్రసాద్ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, తిరిగి పడమర : అత్తోట చలపతిరావుకు చెందిన ఆస్తి, తిరిగి ఉత్తరం : అత్తోట శ్రీదేవికి చెందిన ఆస్తి. ఈ హద్దుల మధ్యగల 18360 చ॥గ॥లు లేదా 15351.34 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలము ఆస్తి, దీనిలో షెడ్యూల్-బి: (ది.01.03.2019 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.2110/2019 ప్రకారం) అవిభాజిత, అనిర్దేశిత 18360 చ॥గ॥లలోని 11642.1/4 చ॥గ॥లు అవిభాజిత, అనిర్దేశిత వాట 47.1/4 చ॥గ॥లు లేదా 39.50 చ॥మీ॥ల విస్తీర్ణము నందలి తిరుమల గార్డెన్‌లోని బి-బ్లాక్ అనగా అంజనాద్రి బ్లాక్‌లోని 4వ అంతస్తులోని 1117 చ॥అ॥ల విస్తీర్ణము గల (కామన్ ఏరియా మరియు అంజనాద్రి బ్లాక్ స్టిల్ట్‌ఫ్లోర్ నందు ఒక కార్ పార్కింగ్‌తో కలిపి) అన్ని ఉమ్మడి మార్గములు, ఉమ్మడి హక్కులు గల ఫ్లాట్ నెం.503. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశము, పడమర: శూన్యాకాశము, ఉత్తరం: శూన్యాకాశము.

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, టుబాకో బోర్డు బ్రాంచ్ (20764), గుంటూరు నుండి లోన్స్ / అడ్వాన్స్‌ల రూపంలో ఋణసౌకర్యములను పొందియున్నారు. మీరు పొందిన ఋణము తిరిగి చెల్లించనందున యన్‌పిఎగా వర్గీకరింపబడి పైన పేర్కొనబడిన సొమ్ము బకాయిగా వున్నది. మేము ఇప్పటికే 11-12-2023 తేదీ గల డిమాండ్ నోటీసు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద తిరుగు రశీదుతో రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించగా అట్టి నోటీసు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరలా నోటీసు జారీచేయడమైనది. సెక్షన్ 13(4) చట్టం క్రింద 60 రోజులలోపు పైన చెప్పిన మొత్తాన్ని చెల్లించని పక్షంలో బ్యాంకుకు తనఖావుంచిన సెక్యూరిటీ ఆస్తులను స్వాధీనం చేసుకొనగలమని మా అభిప్రాయాన్ని తెలియచేయడమైనది. మీకు ఇస్తున్న సూచనలు : 1) అసలు నోటీసు కాపీ/నోటీసుకు సంబంధించిన సమగ్ర వివరములను, అధీకృత అధికారి నుండి పొందవచ్చునని సూచించబడినది. 2) SARFAESI యాక్ట్ క్రింద తదుపరి చర్యలకు పాల్పడకుండా వుండేందుకు నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీ, ఖర్చులతో సహా మొత్తం బకాయి చెల్లించవలసి వుంటుంది.

ప్రదేశం : గుంటూరు, తేది : 16-12-2023 సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఎసిపిసి, గుంటూరు.